రంజాన్ వేళలు
గురువారం	శుక్రవారం
ఇఫ్తార్	సహర్
సా.6.29	ఉ.5.08

సత్య అసత్యాలు తెలుసుకోకుండా విన్నది విన్నట్లు ఇతరులకు ప్రచారం చేసేవాడు కూడా అబద్ధం చెప్పినట్లే..



• ధర్పల్లిలో ఎండిపోయిన వరి పంట

మెట్ట ప్రాంతాల్లో ఎండుతున్న పంటలు

20ఏళ్ల క్రితమే ప్రభుత్వానికి నివేదిక

జిల్లాలోని మెట్టప్రాంతమైన నిజామాబాద్ రూరల్, బాల్కొండ నియోజకవర్గం పరిధిలోని సుమారు పది మండలాల పరిధిలో భూగర్భ జలాలు తక్కువగా ఉన్నాయని 20ఏళ్ల క్రితమే భూగర్భ జల వనరుల శాఖ శాస్త్రవేత్తలు ప్రభుత్వానికి నివేదించారు. ముఖ్యంగా భీంగల్, సిరికొండ, ధర్పల్లి, ఇందల్వాయి, మోపాల్, జక్రాన్‌పల్లి మండలాలో పాటు ఇతర మండలాల పరిధిలో చెక్‌డ్యామ్‌లు, చెరువులు, రిజర్వాయర్‌లు నిర్మించాలని ప్రభుత్వానికి నివేదించారు. ఇసుక నేలలు ఎక్కువగా ఉండటం, భూమి లోపల వంద ఫీట్ల తర్వాత రాతి పొరలు ఉండటం వల్ల ఇబ్బందులు ఏర్పడుతున్నాయని వారు వివరించారు. బోర్లు పెరిగితే భూగర్భ జలాలు తగ్గడంతో పాటు యాసంగి పంటకు అనుకూలంగా ఈ ప్రాంతం ఉండదని వారు నివేదించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ ప్రాంతంలో చెరువుల నిర్మాణం చేపట్టలేదు. కొన్ని చెక్‌డ్యామ్‌ల నిర్మాణం చేసినా ఫలితం లేదు. రామడుగు రిజర్వాయర్ ఉన్నా అదికొంత వరకే ఉపయోగపడుతోంది.

సాగునీటికి ప్రాణహిత చేవెళ్ల

ఉమ్మడి రాష్ట్ర హయాంలో మెట్ట ప్రాంత రైతుల కోసం ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ నుంచి సాగునీరు అందించేందుకు ప్రాణహిత చేవెళ్ల కింద ప్యాకేజీ 20, 21పనులను చేపట్టారు. బినోలా నుంచి సొరంగమార్గం ద్వారా సారంగపూర్ వరకు తీసుకువచ్చేందుకు పనులు పూర్తి చేశారు. అక్కడ పంప్ హౌజ్‌లను ఏర్పాటు చేశారు. రెండేళ్లు అయినా నీటితరలింపు చేపట్టలేదు. సారంగపూర్ పంప్‌హౌజ్ నుంచి నీటిని ఎత్తిపోసి మెంట్రాజ్ పల్లికి తరలించి అక్కడి నుంచి పొలాలకు నీళ్లందించే విధంగా డిజైన్ చేశారు. జిల్లా పరిధిలో 2లక్షల 20ఎకరాలకు సాగునీరు అందించాలని నిర్ణయిం చారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంతో పాటు ఆర్మూర్, బాల్కొండ నియో జకవర్గం పరిధిలోని మెట్టప్రాంతాలకు నీరు అందించే విధంగా ఈ ప్యాకేజీలను డిజైన్ చేశారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత రీడిజైన్ చేసి కాళేశ్వరం పథకంలో కలిపారు. ఉమ్మడి రాష్ట్ర హయాంలో ప్రారంభించిన ఈ పనులు మాత్రం ఇప్పటి వరకు కాలేదు. కాగా, భూగర్భ జలాలు తగ్గిన సమయంలో ఈ ప్యాకేజీ పనులు త్వరగా పూర్తి చేసి వచ్చే వానాకాలంలోపు సాగునీరు అందించాలని రైతులు కోరుతున్నారు.

బోర్లు ఎత్తిపోయాయి : నల్ల సంతోష్‌రెడ్డి, రైతు, ధర్పల్లి

నాలుగు ఎకరాల్లో పొలం వేశాను. రెండు బోర్లు ఉన్నాయి. గత సంవత్సరం ఇబ్బంది తలెత్తలేదు. ఇప్పుడు మాత్రం భూగర్భ జలాలు తగ్గిపోయాయి. ప్రస్తుతం రెండు బోర్ల ద్వారా పంట పూర్తిగా పారడం లేదు. చివరకు ఎకరం పంటను వదిలివేసి మూడు ఎకరాలు మాత్రమే కాపాడుకునేందుకు ప్రయత్నం చేస్తున్నా. కొత్త బోరు వేసేందుకు ప్రయత్నం చేసినా.. నీళ్లు వచ్చే పరిస్థితి లేకపోవడంతో వదిలి వేశాను.

- జిల్లాలో అడుగంటుతున్న భూగర్భ జలాలు
- బోర్లు ఎత్తిపోవడంతో నష్టపోతున్న రైతులు
- పంటను కాపాడుకునేందుకు రైతుల ప్రయత్నాలు
- మెట్ట ప్రాంతాల్లో చెరువులు, రిజర్వాయర్లు లేక ఇబ్బందులు
- కాళేశ్వరం ప్యాకేజీ పనులు చేపట్టి రెండు దశాబ్దాలు
- నేటికీ ఎకరాకు కూడా అందని సాగునీరు
- పనులు పూర్తిచేసి సాగునీరు అందించాలంటున్న రైతులు

నిజామాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): యాసంగి సాగు మెట్టప్రాంత రైతులకు కన్నీరు పెట్టిస్తోంది. భూగర్భ జలాలు అడుగంటడంతో వేసిన పంటలను కాపాడుకునేందుకు రైతులు తిప్పలు పడుతున్నారు. బోర్లు ఎత్తిపోవడంతో వేలాది రూపాయలు ఖర్చు చేసి మళ్లీ కొత్తగా బోర్లను వేస్తున్నారు. అయితే భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టడం వల్ల కొత్తగా బోర్లు వేస్తున్నా.. ఫలితం మాత్రం ఉండటం లేదు. కొద్దిగా ఉన్న భూగర్భ జలాలతో మిగతా పంటలను కాపాడుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. మరికొందరు రైతులు పంటలను వదిలి పెడుతున్నారు. మెట్ట ప్రాంతాల్లో చెరువులు, కాలువలు లేకపోవడం వల్ల సమస్యలు ఎదుర్కొంటున్నారు. ప్రాణహిత చేవెళ్ల కింద చేపట్టిన ప్యాకేజీ పనులు కూడా పూర్తికాకపోవడం వల్ల ఈ మండలాల పరిధిలోని రైతులు నష్టపోతున్నారు.

5లక్షల 40వేల ఎకరాల పంటల సాగు

జిల్లాలో ఈ యాసంగిలో 5లక్షల 40వేల ఎకరాల వరకు పంటలను సాగు చేశారు. ఆరుతడి పంటలతో పాటు వరిసాగును చేపట్టారు. జిల్లాలో ఈ యాసంగిలో 4లక్షల 15వేల ఎకరాలకు పైగా రైతులు వరిపంటను వేశారు. జిల్లాలోని నిజాంసాగర్, శ్రీరాంసాగర్ ఆయకట్టుతో పాటు గుత్ప, అలీసాగర్, చౌట్‌పల్లి హన్మంత్ రెడ్డి ఎత్తిపోతల పథకాలతో పాటు ఇతర ఎత్తిపోతల పథకాల కింద ఈ పంటలను వేశారు. జిల్లా వ్యాప్తంగా ఈ యాసంగిలో సన్నరకాలను ఎక్కువగా సాగు చేశారు. వానాకాలంలో ప్రభుత్వం సన్నరకాలు సాగు చేసిన రైతులకు బోనస్ ప్రకటించడంతో కాలువల ద్వారా సాగునీరు అందుతున్న గ్రామాలతో పాటు మెట్ట ప్రాంతాల్లోని బోర్ల కింద కూడా వరిసాగు చేపట్టారు. కాలువల కింద వరిసాగుకు ఇబ్బందులు లేకున్నా మెట్ట ప్రాంతాల్లో వేసిన రైతులు మాత్రం సమస్యలను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ధర్పల్లి, ఇందల్వాయి, మోపాల్, డిచ్‌పల్లి మండలాల పరిధిలోని కొన్ని గ్రామాల పరిధిలో బోర్లు ఒకేసారి ఎత్తివేయడంతో వేసిన వరిపంటలు ఎండిపోతున్నాయి. రైతులు పంటలను కాపాడుకునేందుకు తిప్పలు పడుతున్నారు. ధర్పల్లి, ఇందల్వాయి, సిరికొండ, డిచ్‌పల్లి, మోపాల్ మండలాల పరిధిలో బోర్ల ద్వారానే వరిసాగు చేపట్టారు. కొన్ని ప్రాంతాల్లో చెరువుల కింద వేశారు. ధర్పల్లి మండలం ఒన్నాజిపేట, నడిమితాండా, ధర్పల్లి, దుబ్బాక, రామడుగు గ్రామాల పరిధిలో సుమారు 200 ఎకరాల వరకు పంట దెబ్బ తింది. కొంతమంది రైతులు పంట ఎండిపోవ డంతో వదిలివేస్తున్నారు. మరికొంత మంది వేసిన పంటలో కొంత విస్తీర్ణం వదిలిపెట్టి మిగతా పంటను రక్షించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ మండలం పరిధిలో సుమారు 18వేల ఎకరాల్లో వరిపంటను వేశారు. అధికారుల లెక్కల ప్రకారం ఐదు మండలాల పరిధిలో సుమారు 500 ఎకరాల వరకు ఇప్పటికే పంట దెబ్బతిన్నట్లు అంచనా వేసినట్లు సమాచారం. రైతులు వ్యవ సాయం కోసం రెండు నుంచి మూడు బోర్ల వరకు వేశారు. ఒక్కొక్క బోరు 600 నుంచి 800 ఫీట్‌ల వరకు ఉంది. గత సంవత్సరం యాసంగిలో ఈ బోర్లు ఎత్తిపో లేదు. పంట మొత్తం చేతికి వచ్చింది.



ధర్పల్లిలో నీటి కోసం కొత్త బోరు వేస్తున్న రైతులు

లక్షా 75వేలకు పైగా బోర్లు

అధికారుల లెక్కల ప్రకారం జిల్లాలో లక్షా 75వేలకు పైగా బోర్లు ఉన్నాయి. వీటి పరిధిలో ఆరుతడి పంటలతో పాటు వరిసాగును చేస్తున్నారు. ప్రతీ సంవత్సరం లాగే ఈ సంవత్సరం పంటను వేసిన రైతులు ఒకేసారి ఎండిపోవడంతో ఆందోళన చెందుతున్నారు. కొంతమంది రైతులు వేల రూపాయలు పెట్టి కొత్త బోర్లను వేస్తున్నారు. జిల్లాలోని మోపాల్, డిచ్‌పల్లి, భీంగల్, ధర్పల్లి మండలాల పరిధిలో ఎక్కువగా తగ్గుముఖం పట్టినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మార్కౌట్ చేయాలి
- ఆస్తిపన్ను, ఎల్ఆర్ఎస్ ఫీజుల వసూళ్లలో వేగం పెంచాలి
- అధికారులతో వీసీలో కలెక్టర్

నిజామాబాద్ అర్బన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ బుధవారం తాగునీటి సరఫరా, ఆస్తిపన్ను, ప్లాట్ల క్రమబద్ధీకరణ రుసుము వసూళ్లు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు మార్కౌట్ చేయడం, రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టళ్లలో కంప్లేయిట్ బాక్సుల ఏర్పాటు తదితర అంశాలపై అదనపు కలెక్టర్ అంకిత్‌తో కలిసి అధికారులతో సమీక్ష జరిపారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని తాగునీటి సరఫరా వ్యవస్థను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలన జరపాలని ఆయన సూచించారు. జిల్లాలో ఏ ఒక్క నివాస ప్రాంతంలోనూ నీటి ఎద్దడి రాకుండా ప్రణాళిక బద్ధంగా వ్యవహరిస్తూ అవసరమైన చోట్ల యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలన్నారు. ఆయా గ్రామాల వారిగా నీటి సరఫరా పరిస్థితిని నిరంతరం సమీక్షించాలని చేతి పంపులు, బోరు బావులకు అవసరమైన చోట తక్షణమే మరమ్మతులు జరిపించాలన్నారు. రెండు రోజుల్లో అన్ని చోట్ల మరమ్మతు పనులు పూర్తి కావాలని గడువు విధించారు. స్థానికంగా ఉండే ప్లంబర్లు, బోరు మెకానిక్‌లను గుర్తిం చాలని, మరమ్మతులు అవసరమైన సమయంలో వారిని సంప్రదించి పనులు జరిపించాలన్నారు. మంచినీటి పథకాలకు విద్యుత్ సరఫరాలో అవాంతరాలు లేకుండా చూడాలని పరీక్షల సీజన్ అయినందున హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లకు నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ప్రతీ ఆవాసంలో ఒక్కో నివాస గృహం వారిగా శుద్ధి జలాలు అందేలా నీటి సరఫరా వ్యవస్థను చక్కదిద్దాలని కుళాయిల బిగింపు ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. వాటర్ ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని, ఓపెన్ బావులను తప్పనిసరిగా క్లోరినేషన్ చేయించాలన్నారు. ఆస్తిపన్ను, ప్లాట్ల క్రమబద్ధీకరణ రుసుము వసూళ్లలో వేగం పెంచాలని నిర్ణీత గడువు లోపు పాత బకాయిలతో సహా వంద శాతం పన్ను వసూలు అయ్యేలా చొరవ చూపాల న్నారు. పన్ను వసూళ్లలో పూర్తిగా వెనుకంజలో ఉన్న గ్రామ పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలని డీఎల్‌పీవోలను ఆదేశించారు. ఎల్ఆర్ ఎస్ క్రమబద్ధీకరణ ఫీజును మార్చి నెలాఖరులోపు చెల్లిస్తే 25 శాతం రిబేట్ వర్తిస్తుందని ఈ విషయాన్ని దరఖాస్తుదారులకు వివరిస్తూ రిబెట్ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి లబ్ధిదారులు నిర్మాణాలు చేసేలా మార్కౌట్ ప్రక్రియను త్వరితగతిన చేపట్టి నిర్దేశిత ఆన్‌లైన్ యాప్‌లో వివరాలు పొందుపర్చాలన్నారు. ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలు, సంక్షేమ వసతి గృహాలలో ఫిర్యాదు పెట్టెలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని వీటి ద్వారా వచ్చే ఫిర్యాదులను ప్రతీవారం పరిశీలిస్తూ సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ వీసీలో జెడ్పీసీఈవో సాయాగౌడ్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్, డీపీవో శ్రీనివాస్, ట్రాన్స్‌కో ఎస్‌ఈ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

మహిళా దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్

నిజామాబాద్ అర్బన్: తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల మహిళా దినోత్సవం పోస్టర్లను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు బుధవారం తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలను గౌరవించుకొని మహిళా దినోత్సవాన్ని నిర్వహించడం గొప్పవిషయమన్నారు. ఈనెల 6,7,8 తేదీలలో టీజీవో ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్ తెలిపారు. మహిళా దినోత్సవ వేడుకలను జిల్లా గెజిటెడ్ ఉద్యోగులు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీజీవో ప్రధాన కార్యదర్శి అమృత్‌కుమార్ పాల్గొన్నారు.



• నగరంలోని పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల క్యూ

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

• తొలిరోజు ప్రశాంతం • పరీక్షా కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

నిజామాబాద్ అర్బన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 57పరీక్షా కేంద్రాలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఇంటర్ మొదటి సంవత్సరం తెలుగు, హిందీ, సంస్కృతం, ఉర్దూ భాషా పరీక్షలకు మొత్తం 19,191 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 18,438 మంది హాజరు కాగా 753 మంది గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 96.1 శాతం విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు ఇంటర్ విద్యాధికారి రవికుమార్ తెలిపారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు నగరంలోని సుభాష్‌నగర్‌లో గల నిర్మల హృదయ కళాశాలలో నిర్వహిస్తున్న పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వాహణ తీరును పరిశీలించారు. విద్యార్థుల హాజరు గురించి ఆరా తీయడంతో పాటు సీసీ కెమెరాల నిఘా నడుమ నిబంధనలకు అనుగుణంగానే పరీక్ష నిర్వహి స్తున్నారా, నిర్ణీత సమయంలో ప్రశ్నపత్రాలను తెరిచారా లేదా అని పరిశీలించారు. పరీక్ష కేంద్రంలో తాగునీటి వసతి, ఏఎన్ఎం, టాయిలెట్లు ఇతర సదుపాయాలు గమనించారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా పరీక్షలు సజావుగా జరిపించాలని, పరీక్ష పూర్తయిన వెంటనే ఆన్సర్‌షీట్‌లు తగిన బందోబస్తు మధ్య నిర్దేశించిన కేంద్రాలకు తరలించాలని ఎలాంటి మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పక్కాగా పరీక్షలు జరిపించాలన్నారు. ఎలక్ట్రానిక్ వాచ్‌లు వంటి ఉపకరణాలను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించవద్దని ఆయన పరీక్ష నిర్వాహకులను ఆదేశించారు.



నిర్మల హృదయలో ఇంటర్ పరీక్షల తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు



• హాల్‌టికెట్ నెంబరు చూసుకుంటున్న విద్యార్థులు

పరీక్షా కేంద్రాల వద్ద సందడి..

ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పరీక్షల ప్రారంభం నేపథ్యంలో ఉదయం నుంచే పరీక్ష కేంద్రాల వద్ద సందడి వాతావరణం నెలకొంది. ఉదయం 9గంటలకు పరీక్ష ప్రారంభం కాగా 7.30 నుంచే విద్యార్థులు పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకున్నారు. తల్లిదండ్రులు విద్యార్థుల వెంట వచ్చి వారికి ఆల్ ద బెస్ట్ చెప్పడం పరీక్ష కేంద్రాల వద్ద కనిపించింది.

పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన డీఐఈవో..

ఇంటర్మీడియెట్ పరీక్షల తొలిరోజు పరీక్షా కేంద్రాలను డీఐఈ వో రవికుమార్ తనిఖీ చేశారు. నగరంలోని ఖిల్లా బాలుర జూనియర్ కళాశాల ఏబీ, సెంటర్లను, కంఠేశ్వర్ ఎస్ఆర్, సీఎస్ఐ, గోల్డెన్ జూబ్లీ, నిర్మల హృదయ, ఉమెన్స్ కళాశాల సెంటర్లను ఆయన తనిఖీ చేశారు. పరీక్షల నిర్వాహణ కమిటీ సభ్యులు, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు, హైపవర్ కమిటీ 50 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.



• విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది



పట్టభద్రుల ఎమ్మెల్సీగా అంజిరెడ్డి గెలుపు

- నగరంలో బీజేపీ శ్రేణుల సంబరాలు
- టపాసులు పేల్చి మిఠాయిలు పంచుకున్న పార్టీ నేతలు 8

పెరుగుతున్న ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం

- డొంకేశ్వర్‌లో వరికి బదులుగా పంటల సాగు
- సబ్సిడీపై మొక్కలు 7

'పొలాల్లో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి'



విద్యుత్ శాఖ అధికారుల పొలంబాట

బోధన్‌రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రైతులు తమ పంట పొలాలకు వెళ్లినప్పుడు విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్ శాఖ టెక్నికల్ డీఈ రమేష్ అన్నారు. బుధవారం సాలూర మండలంలోని హున్సగ్రామంలో రైతులకు పంట పొలాల్లో విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీఈ నగేష్, ఏఈ కళ్యాణ్, లైన్‌మెన్ సునంద్ గౌడ్, అసిస్టెంట్ లైన్‌మెన్ భరత్ పాల్గొన్నారు.

ప్రజలకు నిరంతర విద్యుత్ అందించడమే లక్ష్యం..

ప్రజలకు అంతరాయాలు కలగకుండా నిరంతరం విద్యుత్ అందించడమే లక్ష్యంగా విద్యుత్ శాఖ పని చేస్తుందని బోధన్ ట్రాన్స్‌కో డీఈ ముక్తార్ హైమద్ అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలో సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా వేసవిలో పెరిగే లోడ్‌లకు సరిపడ కెపాసిటీల ట్రాన్స్‌ఫార్మర్లు సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా బాగు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ నగేష్ కుమార్, విద్యుత్ శాఖ టౌన్-1 ఏఈ నాయిని కృష్ణ, ఏఈ కళ్యాణ్ పాల్గొన్నారు.

'గ్రంథాలయాలను వినియోగించుకోవాలి'

బోధన్‌రూరల్, మార్చి5 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడానికి ఎంతగానో ఉపయోగపడతాయని, వినియోగించుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన బోధన్ గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో చదువుకుంటున్న నిరుద్యోగులకు కావాల్సిన వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు.

'అర్హులు ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకోవాలి'

బోధన్‌రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : అర్హులు ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకోవాలని బోధన్ సబ్‌కలెక్టర్ వికాసమహతో తెలిపారు. రాష్ట్రప్రభుత్వం లేఅవుట్లను క్రమబద్ధీకరించే ఉద్దేశంతో 2020లో స్వీకరించిన ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను మార్చి 31, 2025లోగా క్రమబద్ధీకరించుకోవడానికి ఫీజు చెల్లించిన వారికి 25 శాతం రాయితీ లభిస్తుందన్నారు. ఇందుకు ప్రభుత్వం జీవో జారీ చేసిందని సబ్‌కలెక్టర్ తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో ఎల్‌ఆర్‌ఎస్ హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామని, దరఖాస్తుదారులకు ఏమైనా సందేహాలుంటే ఎల్‌ఆర్‌ఎస్ హెల్ప్‌డెస్క్‌కు తెలియజేసి తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని కోరారు. ఇతర వివరాల కోసం సంబంధిత అధికారి వెంకటేష్, టీపీఎస్ ఫోన్ నెంబర్: 6301707191 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

వేంపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ

ఆర్మూర్‌రూరల్, మార్చి5 (ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండలం వేంపల్లిలో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కాంగ్రెస్ నాయకులు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు జక్క రాజేశ్వర్ మాట్లాడుతూ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని, ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రభుత్వం చేపడుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పదోతరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఆర్మూర్‌రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పదోతరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు నర్సయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు సల్లమోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు వినోద్, రఘుపతి, శ్రీనివాస్, మధుమతి పాల్గొన్నారు.

'పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలి'

ఆర్మూర్‌టౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రతీఒక్కరు తమ పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని సానిటరి ఇన్‌స్పెక్టర్ గజానంద్ కోరారు. బుధవారం పట్టణంలోని పలు కళాశాలల్లో విద్యార్థులకు స్వచ్ఛ సర్వేక్షన్ 2024 ఫీడ్ బ్యాక్‌ను చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తడిపొడి హానికరమైన చెత్తను తమ ఇళ్లలో వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందజేయాలని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వాడవద్దని విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ పర్యావరణ ఇంజనీర్ పూర్ణమౌళి, సిబ్బంది నరేష్, సంతోష్, రవి, ప్రశాంత్, రమేష్, రాము, గంగాప్రసాద్, నర్సయ్య పాల్గొన్నారు.

భీమ్‌గల్ : పట్టణంలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించామని మున్సిపల్ కమిషనర్ గోపుగంగాధర్ అన్నారు. ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా నాల్గోవార్డులో శానిటేషన్ కార్యక్రమంలో మురికికాలువలు శుభ్రం చేయించి కాలువల్లో నుంచి చెత్తను తొలగించి డంప్‌యార్డుకు తరలించారు. కార్యక్రమంలో మున్సిపల్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ సున్నపు ఓంకార్, వార్డు ఆఫీసర్ కొత్వాల్ నవీన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ పల్లికొండ శ్రీధర్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లపై అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న అధికారులు

మోర్తాడ్, మార్చి5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దొన్‌పాల్‌లో బుధవారం ఇందిరమ్మ ఇళ్ళపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో గ్రామస్థులకు, మహిళలకు ఇందిరమ్మ ఇళ్ళను మన మార్కవుట్‌పైన గృహ నిర్మాణ శాఖ అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీధర్, గృహ నిర్మాణశాఖ అధికారులు ముత్యాల రాములు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి : ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని, లబ్ధిదారులకు ప్రభుత్వం అనుకున్న విధంగా మూడువిడతలుగా 5 లక్షల రుపాయలు లబ్ధిదారుల ఖతాల్లో జమ అవుతాయని కమ్మర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య అన్నారు. బుధవారం మండలంలోని నాగాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ మొగ్గువేసి పనులకు ప్రాంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతు లబ్దిదారులు త్వరితగతిన తమ ఇండ్ల నిర్మాణం బెస్‌మెట్ లెవల్ పనులు పూర్తి చేస్తే అధికారులు ఫొటోతీసి అప్‌లోడ్ చేస్తారని వెంటనే లబ్ధిదారుల ఖతాల్లో లక్ష రూపాయలు జమవుతాయన్నారు. ఇదేవిధంగా లెటల్ లెవల్, స్లాబ్‌లెవల్ వరకు మూడు విడతలుగా ఐదు లక్షల రూపాయలు జమవుతాయన్నారు.

ఇష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలి

● రాష్ట్ర ఆదర్శ పాఠశాలల అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసాచారి



సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్ శ్రీనివాసచారి

జక్రాన్‌పల్లి, మార్చి5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టంతో బాగా చదువుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని రాష్ట్ర ఆదర్శ పాఠశాలల అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసచారి అన్నారు. బుధవారం జక్రాన్‌పల్లిలోని ఆదర్శ పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు విజయస్ఫూర్తి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాస్‌చారి మాట్లాడుతూ పరీక్షలు అంటే భయపడవద్దని, ధైర్యంగా ఉండి పరీక్షలు రాయాలన్నారు. విద్యార్థులు బాగా చదివితేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. అనంతరం డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలు రాసేటప్పుడు భయపడవద్దని, ఉత్సహంతో సంతోషంగా పరీక్షలు రాయాలన్నారు. విద్యార్థులు పరీక్షలపైన అవగాహన కల్పించి పరీక్షలు రాసే విధానంపై సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసచారిని డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్‌ను పాఠశాల ప్రిన్సిపాల్ సుధారాణి, ఉపాధ్యాయులు కలిసి వారిని సన్మానించారు. పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించి పరీక్షలు రాసే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండలాల్లో ఇంటర్ పరీక్షలు ప్రారంభం



ఆర్మూర్‌లో పరీక్షకేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

నవీపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగాయని నవీపేట మోడల్ కళాశాల ప్రిన్సిపాల్, పరీక్ష కేంద్రం చీఫ్ సూపరిండెంట్ శ్రీనివాస్ తెలిపారు. నవీపేట, రెంజల్ మోడల్ కళాశాలలతో పాటు రెంజల్ మైనారిటీ బాలికల గురుకుల పాఠశాల, మోకన్‌పల్లి కేజీబీవీ కళాశాల, నవీపేటలోని నవోదయ కళాశాలలకు చెందిన విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు ఆయన పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 401మందికి గాను 382మంది విద్యార్థులు హాజరు కాగా 19మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు ఆయన పేర్కొన్నారు.

● నేడు ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు

నవీపేట మోడల్ కళాశాల పరీక్ష కేంద్రంలో గురువారం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం కానున్నాయని నవీపేట మోడల్ కళాశాల ప్రిన్సిపాల్, పరీక్ష కేంద్రం చీఫ్ సూపరిండెంట్ శ్రీనివాస్ తెలిపారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు గాను 362మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని ఆయన వివరించారు.

బోధన్‌రూరల్ : బోధన్ పట్టణంలో బుధవారం ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్ష కేంద్రాల వద్ద ఉదయం 8:30 గంటలకు విద్యార్థులు చేరుకున్నారు. విద్యార్థులను పది నిమిషాల ముందు పరీక్ష కేంద్రంలోకి నిర్వాహకులు లోనికి అనుమతి ఇచ్చారు. విద్యార్థులను ప్రత్యేకంగా తనిఖీ చేశారు. మాస్క్ కాపీయింగ్‌కు పాల్పడకుండా చర్యలు తీసుకున్నారు. 9గంటల పరీక్ష ప్రారంభం అవనుండగా మరో 5నిమిషాల పాటు విద్యార్థులకు సౌకర్యం కల్పించారు. మొదటి రోజు ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారులు మాట్లాడుతూ బోధన్‌లో 9పరీక్షలు కేంద్రాలు, 20మంది సిబ్బంది, 180ఇన్విజిలేటర్లు, 200 మంది విధుల్లో పాల్గొన్నారన్నారు.

పరీక్ష కేంద్రాలను పరిశీలించిన ఎస్సై

ఆర్మూర్‌టౌన్ : మున్సిపల్ పరిధిలో జరుగుతున్న ఇంటర్ పరీక్ష కేంద్రాలను ఎస్సై గోవింద్ పరిశీలించారు. బుధవారం ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభం కావడంతో ఎస్సై గోవింద్ ప్రతీ సెంటర్‌కు వెళ్ళి విద్యార్థుల తల్లిదండ్రులను సెంటర్‌కు దగ్గరలో ఉండవద్దని సూచించారు. ఆయన వెంట ఎఎస్సై చిన్నయ్య, కానిస్టేబుల్‌లు ఉన్నారు.

పెర్కిట్ : మొదటిరోజు ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరం తెలుగు పరీక్ష ప్రశాంతంగా సాగింది. బుధవారం పట్టణంలోని పలు పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థిని విద్యార్థులు సమయానికి ముందే చేరుకొని పరీక్షలు రాశారు. ఒక నిమిషం నిబంధన లేకపోయిన పరీక్ష కేంద్రాన్ని విద్యార్థిని విద్యార్థులు సకాలంలో చేరుకున్నారు.

కోటగిరి : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ బుధవారం పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఇంటర్మీ డియట్ మొదటి సంవత్సరంలో 217 మంది విద్యార్థులు ఉండగా, పరీక్ష లకు 205 మంది విద్యార్థులు హాజరయ్యారు. 12 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ కైసర్ పాషా తెలిపారు.

ఎండు గంజాయి కాల్చివేత



సంచులను పరిశీలిస్తున్న నిజామాబాద్ ఇన్‌చార్జి పోలీస్‌కమిషనర్

జక్రాన్‌పల్లి, మార్చి5 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ డ్రగ్స్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో పాత కేసులలో సీజ్‌చేసి మూడుకిలోల 404 గ్రాముల అల్ప్రాజోలం, 616కిలోల 837గ్రాముల ఎండు గంజాయిని పోలీసులు కాల్చివేశారు. బుధవారం మండలంలోని పడకల్ గ్రామంలో మేడికేర్ సర్వీస్ సెంటర్‌లో నిజామాబాద్ ఇన్‌చార్జీ పోలీస్‌కమిషనర్ సీహెచ్.సింధుశర్మ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్ పరిధిలలో 23 కేసులలోని 616కిలోల 837 ఎండు గంజాయి, మూడు కిలోల 404 గ్రాముల అల్ప్రాజోలంను పోలీసులు కాల్చివేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ బస్వారెడ్డి, నిజామాబాద్ ఏసీపీ రాజవెంకట్‌రాంరెడ్డి, సీసీ ఆర్‌బీ ఏసీపీ రవీంధర్‌రెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

పసుపు పరిశోధన కేంద్రాన్ని సందర్శించిన మహారాష్ట్ర రైతులు



పసుపు కేంద్రాన్ని సందర్శించిన మహారాష్ట్ర రైతులు

కమ్మర్‌పల్లి, మార్చి 5: (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్ర హింగోలికి చెందిన పసుపు రైతులు బుధవారంమండలకేంద్రంలోని కొండాలక్ష్మణ్ తెలంగాణ ఉద్యానవన విశ్వవిద్యాలయలం పసుపు పరిశోదన కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారికి శాస్త్రవేత్త డి.మహేందర్ పరిశోధనలు, పసుపు వంగడాలు, పరిశోధన విధానం పవర్ ప్రజంటేషన్ ద్వార వివరించారు. కాగా పరిశోదన కేంద్రంలోని పరికరాలను, అవి పనిచేసే విధానాలను హింగోలి రైతులకు వివరించారు. దీంతో పాటు పసుపు కుటీర పరిశ్రమగా అభివృద్ధి చెందే మార్గాలపై చర్చించారు.

భూములను విక్రయించిన వారిపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఎస్‌ఐటీపీ ఉపాధ్యక్షుడు

ఆర్మూర్‌టౌన్, మార్చి5(ఆంధ్రజ్యోతి): సీఎస్‌ఐ చర్చ్‌లకు చెందిన భూములను విక్రయించిన వారిపై చర్యలు తీసుకోవాలని సీఎస్‌ఐటీపీ ఉపాధ్యక్షుడు గుంద్ర కృపనందం, లీగల్‌బోర్డు కన్వీనర్ అనిల్‌కుమార్‌లు తెలిపారు. బుధవారం పట్టణంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆర్మూర్ సీఐఎస్ చర్చ్‌లకు చెందిన భూములు, భవనాలు కాపాడేందు కోసం తాము చర్యలు తీసుకుంటున్నామని, వీటి విక్రయాలు, లీజులపై జిల్లా కలెక్టర్ ఫిర్యాదు చేసినట్టు వారు తెలిపారు. చర్చ్ పరిధిలో గతంలో 63 ఎకరాల స్థలం ఉండగా ప్రస్తుతం ఆరుఎకరాల స్థలం మిగిలిందని, మిగతా 57 ఎకరాల స్థలాన్ని కొందరు సొంత ప్రయోజనాల కోసం అమ్మేశారని ఆరోపించారు. కోట్ల రూపాయల విలువ గల స్థలాన్ని చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా ట్రస్ట్ అసోసియేషన్ కంపెనీ డైరెక్టర్ల అనుమతి లేకుండా విక్రయించరాదని, లీజు ఇవ్వడానికి కూడా అధికారం లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రేపల్లె బాబీప్రసాద్, రవిచంద్రన్, డెవిడ్ రాజ్, పాల్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.

వేధింపులు భరించలేక గృహిణి ఆత్మహత్య



పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు

భీమ్‌గల్, మార్చి5(ఆంధ్రజ్యోతి): భీమ్‌గల్ మున్సిపల్ పరిధిలోని లింబాద్రిగుట్ట కాలనీకి చెందిన రేపల్లె సుమలత (22) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనపై ఎస్సై మహేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జక్రాన్‌పల్లి మండలం బాల్‌నగర్‌కు చెందిన సుమలతకు 2016లో లింబాద్రిగుట్ట కాలనీకి చెందిన సంతోష్‌తో వివాహమైంది. వీరికి కూతురు, కుమారులున్నారు. కొన్ని రోజుల క్రితం తోడికోడలు రేపల్లె లావణ్యతో గొడవలు జరిగాయి. తోడికోడలు, బంధువులు మృతురాలి తండ్రిపై దాడి చేయగా కేసు నమోదు అయింది. దీని దృష్టిలో పెట్టుకున్న తోడికోడలు ప్రతినిత్యం ఇంటి వద్ద పెడుతున్న వేధింపులు భరించలేక మంగళవారం పురుగుల మందు తాగిందని ఎస్సై తెలిపారు. చికిత్స నిమిత్తం నిజామాబాద్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందిందన్నారు.. తండ్రి ఓర్సు బాలయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్టు ఎస్సై తెలిపారు. సుమలత మృతికి కారకులైన తోడి కోడలు లావణ్య, ఆమె కుటుంబసభ్యులను శిక్షించాలని కోరుతూ మృతురాలి తరపు బంధువులు పోలీస్ స్టేషన్‌కు తరలివచ్చారు. బంధువులు రోడ్డుపై బైటాయించేందుకు ప్రయత్నించారు. చివరకు భీమ్‌గల్, ఏర్గట్ల ఎస్సైలు మహేష్, రాములు వారిని సముదాయించి కారకులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో మృతురాలి బంధువులు శాంతించారు.



మృతిచెందిన రేపల్లె సుమలత

బాధితుడికి ఎల్‌వోసీ అందజేత

మోర్తాడ్, మార్చి5(ఆంధ్రజ్యోతి): మండలంలోని దొన్కల్ గ్రామానికి చెందిన కె.ప్రవీన్ గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చేరారు. ఆయనకు ఆపరేషన్ అవసరమని వైద్యులు సూచించగా ఆర్థికసహాయం కోసం బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్‌ను ఆశ్రయించారు. దీంతో ఆయన సీఎం సహాయనిధి నుంచి రూ.2 లక్షల 50వేల ఎల్‌వోసీని మంజూరు చేయించి బాధితునికి అందజేశారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్‌కు ఆయన కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

వేతన బకాయిలు చెల్లించాలని నిరసన



ఫ్యాక్టరీ గేటు ఎదుట ధర్నా చేస్తున్న కార్మికసంఘాల నాయకులు

బోధన్‌రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ లేఆఫ్ అయిన కాలం నుంచి కార్మికులకు రావాల్సిన వేతన బకాయిలు చెల్లించాలని కార్మిక సంఘాల నాయకులు బుధవారం ఫ్యాక్టరీ గేటు ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ పది సంవత్సరాలుగా కార్మికులకు రావాల్సిన వేతనాలు రాకపోవడంతో కార్మికులు అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిజాంషుగర్స్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని చెబుతున్నప్పటికీ ఇంకా పనులు ముందుకు వెళ్లడం లేదన్నారు. ప్రభుత్వం వేసిన కమిటీ సాధ్యఅసాధ్యల కమిటీ కాదని, అది కాలయాపన కమిటీ అని ఆరోపించారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి నిజాంషుగర్స్ ఫ్యాక్టరీని తెరిపించాలని, కార్మికులకు రావాల్సిన వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు ఉపేందర్, నాగుల రవి శంకర్ గౌడ్, బాలకృష్ణ, ఈరవేణి సత్యనారాయణ, శ్రీనివాస్, రాంబాబు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నవీపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోస్లీలో బుధవారం ఉదయం అయిటి రాజేశ్వర్ (50) అనే వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఏఎస్ఐ మోహన్‌రెడ్డి తెలిపారు. మృతుడు రాజేశ్వర్‌కు సంవత్సరంన్నర క్రితం నాగేపూర్ వద్ద జరిగిన రోడ్డుప్రమాదంలో అతని తలకు, కన్నుకు గాయాలయ్యాయని అన్నారు. దీనికి తోడు అనారోగ్యానికి గురికావడంతో జీవితంపై విరక్తి చెంది బుధవారం తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఏఎస్ఐ వివరించారు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమార్తెలున్నారన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

రోడ్డుప్రమాదంలో విద్యుత్ ఆపరేటర్ మృతి

ఎడపల్లి, మార్చి 05 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జానకంపేట గ్రామశివారులో జానకంపేట-ఠాణాకలాన్ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో ఠానాకలాన్ గ్రామానికి చెందిన మెట్టు శ్రీనివాస్(26) అనే యువకుడు మరణించినట్లు ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మెట్టు శ్రీనివాస్ జక్రాన్‌పల్లి మండలంలోని తొర్లికొండ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడని, బుధవారం సాయంత్రం తన ద్విచక్ర వాహనంపై జానకంపేట నుంచి తన స్వగ్రామం ఠానాకలాన్‌కు తిరిగి వస్తుండగా జానకంపేట గ్రామ శివారులో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మరణించాడని తెలిపారు. మృతుడి తల్లి సవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్సై తెలిపారు.

మలిదశ ఉద్యమకారుడికి అంతిమ వీడ్కోలు

వర్ని, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డేపల్లి గ్రామానికి చెందిన తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ నాయకులు కృష్ణాగౌడ్ బుధవారం మృతిచెందారు. పలువురు నాయకులు ఘననివాళులు అర్పించారు. తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ నాయకులు కృష్ణాగౌడ్ అకాల మరణం తీరనిలోటన్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

కోటగిరి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రుద్రూరు మండలంలోని బొప్పాపూర్ గ్రామానికి చెందిన బొర్ర చిన్నసాయిలు (45) అనే వ్యక్తి చేపల వేటకు వెళ్లి మృతిచెందినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. సాయిలు గుండ్ల వాగులో చేపల వల వేసేందుకు మంగళవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లాడు. వాగులో చేపల వలవేసి ఒడ్డుకు చేరే క్రమంలో ప్రమాదవశాత్తు బురద కుంటలో పడి మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. మృతునికి ఇద్దరు కూతుళ్లు, కొడుకు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుని భార్య గోదావరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

'విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి'



జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థుల నృత్య ప్రదర్శన

కోటగిరి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి జీవితంలో 10వ తరగతి అత్యంత కీలకమని, కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పోతంగల్ మండల విద్యాధికారి శంకర్ సూచించారు. పోతంగల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకలను పురస్కరించుకొని పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. విద్యార్థుల నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. లక్ష్యంతో చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉం టుందని పేర్కొన్నారు. పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష అట్టలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ గంగాధర్, ప్రధానోపాధ్యాయులు సాయిలు, పీఆర్‌టీయూ నాయకులు శ్రీనివాసరెడ్డి, నాగనాథ్, శ్రీరామ్, నాయకులు శంకర్, వహీద్, వీరేశం పాల్గొన్నారు.

బోధన్ బాలుర-1లో ప్రవేశాల దరఖాస్తుల గడువు పెంపు

బోధన్‌రూరల్, మార్చి5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాల బోధన్ బాలుర-1లో ప్రవేశాల దరఖాస్తులకు గడువు పెంచినట్లు ప్రిన్సిపాల్ అహ్మద్ అబ్దుల్ బషీర్ తెలిపారు. బోధన్ బాలుర నందు 2025-26సంవత్సరం కోసం 5వ తరగతిలో 40సీట్లు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీలో 40 సీట్లు, బైపీసీలో 40 సీట్ల కోసం ఆసక్తి ఉన్న మైనార్టీ, నాన్ మైనార్టీ విద్యార్థులు, 6,7,8 తరగతుల్లో మిగులు సీట్ల కోసం మైనార్టీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, ఈ నెల 31వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అవసరమైన వారు 9985069614 నెంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవాలని పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'నల్లాలకు మోటార్లు బిగిస్తే కఠిన చర్యలు'

భీమ్‌గల్‌రూరల్, మార్చి5 (ఆంధ్రజ్యోతి): మండలంలో అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలని, మిషన్ భగీరథ నల్లాలకు ఎవరైనా మోటార్లు బిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో గంగుల సంతోష్‌కుమార్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీవో జావేద్‌అలీ, డీఈఈ దర్మేందర్, ఏఈ అమూల్య, కారోబార్‌లున్నారు.

చోరీ అయిన ఆభరణాలు స్వాధీనం

ఆర్మూర్‌టౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతబస్టాండ్ సమీపంలో అలకుంట శ్రీనివాస్ అనే నిందితుడిని పట్టుకొని బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. మండలంలోని మిర్దాపల్లి, దేగాం గ్రామంలో తాళం వేసి ఉన్న ఇళ్ళలో అర్ధరాత్రి సమయంలో చోరీలను పాల్పడినట్టు విచారణలో తేలింది. దీంతో నిందితుడైన శ్రీనివాస్‌ను పట్టుకొని సుమారు మూడుతులాల బంగారు ఆభరణాలు, అలాగే సుమారు ఏడుతులాల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకొని నిందితుడిని రిమాండ్‌కు పంపినట్టు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కేసులు నమోదు

కమ్మర్‌పల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జాతీయరహదారికి ఇరువైపులా వ్యాపారాలు, దుకాణాలు ఏర్పాటు చేసి, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని కమ్మర్‌పల్లి ఎస్ఐ అనీల్ రెడ్డి అన్నారు. బుధవారం జాతీయరహదారి సంబంధిత అధికారి కమ్మర్‌పల్లి మీదుగా వెళుతూ రోడ్డెపైన ఉన్న దుకాణాలను పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన ఎస్ఐ అనీల్ రెడ్డి రోడ్డెక్కిన దుకాణాలను పూర్తిగా ప్లాట్‌ఫారం లోపలివైపు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు.

'చట్టాలపై అవగాహన అవసరం'

కమ్మర్‌పల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : బాలికలు తమ రక్షణ కోసం ఏర్పాటు చేసిన చట్టాలపై అవగాహన చేసుకుని అన్ని రంగాల్లో ముందుండాలని జిల్లా సంక్షేమ అధికారి ఎస్కే రసూల్ బీ అన్నారు. బుధవారం కమ్మర్‌పల్లి మండలం కోనాసముందర్ ఉన్నత పాఠశాలలో బాలికల హక్కులు చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలికల విలువలను, ప్రాముఖ్యతను వివరిస్తు షోషల్ మీడియా ప్రభావం, చదువు, బాలికలు ఉన్నస్థాయి వరకు వెళ్లడానికి ప్రభుత్వాలు కల్పిస్తున్న పథకాలు సదుపాయాలపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు, పోక్సో చట్టాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

ఫటా..ఫట్...

ప్రతీ రోజు 490 మందికి ఓపీ

• వెంకటేశ్వర్లు, పీహెచ్‌సీ సూపరింటెండెంట్, దోమకొండ



దోమకొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి (సీహెచ్‌సీ)లో ఇన్ పెషేంట్, అవుట్ పెషేంట్‌లకు అన్ని రకాల సేవలను వైద్యులు, సిబ్బందితో కలసి అందిస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

ఆంధ్రజ్యోతి: మీ ఆసుపత్రిలో రోజుకు ఎంత మంది రోగులు వస్తుంటారు

సూపరింటెండెంట్: ప్రతీ రోజు ఆసుపత్రికి ఓపీ 490 మంది వరకు ఉంటుంది.

ఆంధ్రజ్యోతి: ఇన్ పెషేంట్లు ఎంత మంది ఉంటారు రోజుకు

సూపరింటెండెంట్: ప్రతీ 20 నుంచి 30 మంది ఇన్ పెషేంట్లు ఉంటారు. పిల్లలు 10 నుంచి 15 మంది ఓపీ ఉంటారు అందులో 3 నుంచి 5 వరకు అడ్మిట్ అవుతుంటారు.

ఆంధ్రజ్యోతి: మొత్తం నెలకి ఎంత మంది పరీక్షలకు వస్తుంటారు. అందులో పిల్లలు ఎందరు ఉండోచ్చు

సూపరింటెండెంట్: ప్రతీ నెలకు సుమారు. 9965 మంది వరకు వస్తుంటారు. అందులో పిల్లలు 910 వరకు ఉన్నారు. ఏడాదికి 1 లక్షాకు పైగా రోగులకు వైద్యులు, సిబ్బంది కలసి సేవలు అందిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ఆసుపత్రిలో వసతులు, మందులు అందుబాటులో ఉన్నాయా

సూపరింటెండెంట్: ప్రస్తుతం ఆసుప్రతిలో ఎలాంటి మందుల కొరత లేదు. వసతులు అన్ని ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి: ఆసుపత్రిలో రెగ్యూలర్ వైద్యులు ఎందరు ఉన్నారు.

సూపరింటెండెంట్: ఆసుపత్రిలో రెగ్యూలర్ వైద్యులు నాతో కలసి ముగ్గురు ఉన్నారు. శ్రీవాణి సివిల్ అసిస్టెంట్ సర్జన్(ఫీజిషియన్), దివ్యా రేడియాలజిస్ట్ ఉన్నారు. మిగాత వైద్యులు కాంట్రాక్ట్ పద్దతిలో కొనసాగుతున్నారు. అందులో నెలకు ఎక్సరే 237, స్కానింగ్ 390, బీపీ, షుగర్, సీబీటీ, సీఆర్‌పీ, ఆర్‌బీఎస్, ఈసీజీ కలిపి 1223 టెస్టులు నిర్వహించడం జరుగుతుంది. డెంటల్ ఓపీ 250 వరకు ఉంటుంది.

ఆంధ్రజ్యోతి: సిబ్బంది సరిపోయేంత ఉన్నారా

సూపరింటెండెంట్: ఆసుపత్రిలో ప్రస్తుతం సిబ్బంది 10 మంది స్టాఫ్ నర్సులు, 3 వైద్యులు, ఇతర సిబ్బంది ఉన్నాము.ఇన్ పెషేంట్లకు, అవుట్ పెషేంట్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందజేస్తున్నాము.

• (ఆంధ్రజ్యోతి, దోమకొండ)

పెరుగుతున్న ఆయిల్‌పాం సాగు విస్తీర్ణం



నూత్‌పల్లిలో ఆయిల్ పాం పంటను పరిశీలిస్తున్న అధికారులు



గంగాసరంలో సాగు చేస్తున్న అంతర్ పంట

డొంకేశ్వర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులను అనుకూలంగా రైతులు ముందు చూపుతో పంటలను సాగు చేస్తున్నారు. రైతులు ఆయిల్ పాం సాగుపై దృష్టి సారిస్తున్నారు. వరికి ప్రత్యామ్నయంగా ఆయిల్ పాం సాగుతో రైతులు ఆర్థికంగా బలపడాలని ప్రభుత్వం పేర్కొనడం వ్యవసాయ అధికారులు అవగాహన కల్పిస్తుండడంతో మండలంలో రైతులు ఆయిల్‌పాం పంట సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఆయిల్ పాం సాగుచేస్తే చీడపీడలు, పురుగులు, క్రిమి కీటకాల బెడద చాలా తక్కువగా ఉండడం వల్ల ఈ పంటపై రైతుల్లో ఆసక్తి పెరుగుతోంది. పంటసాగు ప్రారంభించిన తర్వాత నాలుగైదేళ్లు కష్ట పడితే తర్వాత ఎక్కువ శ్రమించకుండానే ఫలితం పొందే అవకాశం ఉంటుంది. అతి తక్కువ ఖర్చుతో పండే ఈ పంట గాలివాన వీచినా ఎలాంటి నష్టం వాటిల్లదు. చీడలు, పురుగుల బెడద తక్కువగా ఉంటుంది. దీంతో డొంకేశ్వర్ మండల పరిధిలో 13గ్రామాలు ఉండగా అందులో డొంకేశ్వర్, నూత్‌పల్లి, గంగాసరం, నికాల్‌పూర్, మారంపల్లి, జీజీ నడుకుడ, దత్తాపూర్ గ్రామాల్లో 201 ఎకరాల్లో ఆయిల్‌పాం మొక్కలను నాటారు.

సబ్సిడీపై మొక్కలు..

ఆయిల్‌పాం మొక్క అసలు ధర రూ.193కాగా ప్రభుత్వం సబ్సిడీ పోను రైతుకు 20మాత్రమే చెల్లించాలి. అయితే ఒక్క ఎకరాకు 50 మొక్కలు అవసరం ఉండగా రైతులు 100చెల్లిస్తే ప్రభుత్వం రూ.8650 చెల్లిస్తుంది. ఆయిల్‌పాం మొక్కలు నాటిన నుంచి మొదటి నాలుగేళ్ల వరకు ఎకరాకు రూ.4200 చొప్పున ప్రభుత్వం మొక్కల సంరక్షణకు సాయం అందిస్తుంది. ఆయిల్‌పాం సాగులో డ్రిప్ ఏర్పాటుకు సబ్సిడీ ఇస్తుంది. ఎస్సీ, ఎస్టీలకు జీఎస్టీ చెల్లిస్తే 100శాతం సబ్సిడీపై మిగతా రైతులకు 90 శాతం సబ్సిడీపై డ్రిప్పులను అందజేస్తు న్నట్టు అధికారులు పేర్కొంటున్నారు.

ఆయిల్ పాం సాగుతో 30 ఏళ్ల పాటు దిగుబడి..

ఆయిల్ పాం మొక్కలు నాటిన తర్వాత నాలుగేళ్ళ నుంచి పంట కాతకు వస్తుంది. 30 ఏళ్ల వరకు దిగు బడి వస్తుంది. నాల్గవ ఏట ఆరు నుంచి ఏడు టన్నుల దిగుబడి రానుంది. ఇలా గడిచిన కొద్ది సుమారు ఏడా దికి దాదాపు పది టన్నుల దిగుబడి వస్తుందని ఒక టన్నుకు రూ.20 వేల900 కాగా పెట్టుబడి పోను ఏడాదికి రూ.2లక్షలకు పైగా ఆదాయం వస్తుందని అధికారులు పేర్కొంటున్నారు. అయిల్‌ఫాం సాగులో అంతర పంటలుగా సోయా, జొన్న, మక్క, పసుపు, తదితర పంటలను సాగు చేసుకుంటే రైతులకు అదనపు ఆదాయం సమ కూరుతుంది.

రైతులకు మేలు

• రాజాగౌడ్, ఉద్యానవన అధికారి

ఆయిల్‌పాం సాగుకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుంది. ఆయిల్ పాం సాగు చేస్తే రైతులకు లాభాదాయకంగా ఉంటుంది. లేబర్ ఖర్చు తక్కువగా ఉంటుంది. అంతర పంటలు సాగు చేసుకోవచ్చు. రైతులు ఆయిల్‌పాం చెట్టుకు కొమ్మలను తొలగించే సమయంలో ఎండిన కొమ్మలని మాత్రమే తియాలి. పచ్చి కొమ్మలను తొలగించడం చెట్లకు ఒక మీటర్ దూరం వదిలి ట్రాక్టర్‌తో దున్నుకోవాలి. ఆయిల్ పాం చెట్టు పెరిగిన తర్వాత కూడా రైతులు నీడ పంటలను పండించుకోవచ్చు.

ఆయిల్‌పాం పంట సాగు చేస్తే నష్టం లేదు

• దేగాం గంగారెడ్డి, రైతు, నూత్‌పల్లి

నాలుగు ఎకరాల ఆయిల్‌పాం పంటను సాగు చేస్తున్నా ను. పంట సాగు చేయడం వల్ల నష్టమేమి లేదు. ప్రభుత్వం ఆయిల్‌పాం సాగు చేస్తున్న రైతులకు ప్రోత్సాహం అందిస్తుంది. ఆయిల్‌పాం పంటలో అంతర పంటలు సాగు చేస్తున్న ఈసారి కోక్ పంటను సాగు చేయడానికి వెస్ట్ గోదావరి ఏలూరు వెళ్ళి అక్కడ సాగు చేస్తున్న పంటను చూశాను. ఈసారి కూడా ఆ పంట సాగు చేస్తున్నా ఆయిల్‌పాం గెలలు కోతకు వచ్చాయి. అంతర్ పంటగా కోక్ తోట సాగు చేయడం వల్ల రైతులకు ఆదాయం మరింత పెరుగుతుంది.

దంతాల రక్షణ.. అందరి బాధ్యత!

• నేడు నేషనల్ డెంటిస్ట్ డే

నిజామాబాద్ అర్బన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): దంతాలు బాగుంటేనే చిరునవ్వు బాగుంటుంది తద్వార మనం అందంగా కనిపించగలుగుతాం. కానీ చాలా మంది దంతాల విషయంలో నిర్లక్ష్యం చేయడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు పాలవుతున్నారు. మన దేశంలో అన్ని వయస్సుల వారు అనేక దంత సమస్యలను ఎదుర్కొంటున్నట్లు పరిశోధనలు చెబుతున్నాయి. దంత సమస్యల విషయంలో సరైన అవగాహన లేకపోవడంతో చాలా మంది డాక్టర్ల వద్దకు వెళ్లి చికిత్సలు చేసుకునేందుకు వెనుకాడుతున్నారు. దాని వల్ల సమస్యలు మరింత పెరిగి దంతాలను పూర్తిగా కోల్పోతున్నారు. ప్రస్తుతం టెక్నాలజీ పెరగడంతో దంతాలు ఊడి పోయినా ఇంప్లాంట్స్ ద్వారా దంతాలను ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంది. కృత్రి మంగా పళ్లను అమర్చే విధానాన్ని ప్రస్తుతం డాక్టర్లు ఏర్పాటు చేస్తున్నారు. పుప్పళ్లు రాకుండా, ఎత్తు పళ్లు, వంకర పళ్లను సరిచేసే మెటల్ క్లిప్స్ విధానంతో పాటు పళ్లను తెల్లగా చేసే చికిత్సలు కూడా నేడు దంత వైద్యులు అంద జేస్తున్నారు. నేడు జాతీయ డెంటిస్ట్ డే సందర్భంగా పలు చికిత్సా విధానాలను తెలుసుకుందాం.

పుప్పళ్లు రాకుండా నివారణ ఇలా

పుప్పళ్లు రాకుండా చికిత్స కంటే నివారణ మార్గాలే ఉత్తమం అని దంత వైద్యులు చెబుతున్నారు. చిన్న పిల్లలకు ఫిట్ అండ్ ఫిషర్ సిలెన్స్ ద్వారా పుప్పళ్లు రాకుండా నిరోధించవచ్చు. ఇవి సూక్ష్మ క్రిములు పళ్లలోపలికి వెళ్లకుండా రక్షణగా పనిచేస్తాయి.

పళ్ల డిజైన్

పళ్ల వరుస చక్కగా ఉంటే చిరునవ్వు చక్కగా వస్తుంది. నేటి యువత పళ్ల వరుస చక్కగా ఉండాలని కోరుకుంటున్నారు. ఇప్పుడు స్మైల్ డిజైనింగ్‌కు ఎక్కువ ఆధరణ ఉంది. పళ్లను, చిగుళ్లను, నోటి ఎముకలను కొద్దిపాటి మార్పుల ద్వారా పళ్ల వరుసను మార్చుకోవచ్చు. ఏ వయస్సు వారైనా ఈ పళ్ల వరుసను మార్చుకునే అవకాశం ఉంది.

ఇంప్లాంట్స్ ద్వారా కృత్రిమ పళ్లు

వయస్సు పెరిగినా కొద్ది పళ్లు ఊడి పోవడం సహజం. కానీ చిన్న వయస్సులోనే కొందరికి పళ్లు ఊడిపోయి మొఖం బోసి పోయినట్లు కనిపిస్తుంది. అలాంటి వారికి ఇప్పుడు ఇంప్లాంట్ ద్వారా పళ్లు ఊడిపోయిన చోటే కృత్రిమ పళ్లను ఆపరేషన్ ద్వారా ఏర్పాటు చేసుకోవచ్చు. ఇదివరకు ఉన్న పళ్లతో సమానంగా అదే స్థాయిలో కృత్రిమ పళ్లను వైద్యులు ఏర్పాటు చేస్తున్నారు.

దంతాలను రక్షించుకోవడం అందరి బాధ్యత

• డాక్టర్ శ్రీనునాయక్, ప్రముఖ దంతవైద్యుడు



దంతాల పట్ల నిర్లక్ష్యం చేయకుండా దంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. చిన్నపాటి దంత సమస్యలు వచ్చిన వైద్యుల ను సంప్రదించాలి. ప్రతీరోజు రెండుసార్లు దంతాలను శుభ్ర పర్చుకోవాలి. ప్రతీ ఆరు నెలల కోసారి దంత వైద్యులను సంప్రదించుకొని చెకప్ చేసుకుంటే చాలా వరకు దంత సమస్యల ను పరిష్కరించవచ్చు.



టీయూలో మాట్లాడుతున్న వీసీ యాదగిరి రావు

బయోటెక్నాలజీ పరిశోధనలతో బహుముఖ ప్రయోజనాలు

• టీయూ వైస్ చాన్స్‌లర్ ప్రొ.యాదగిరి రావు

డిచ్‌పల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీలో బుధవారం బయోటెక్నాలజీ విభాగంలో బయోటెక్నాలజికల్ ప్రయోగశాల ప్రదర్శనపై ఒక రోజు కార్యశాల జరిగింది. కన్వీనర్ డా.ప్రసన్నశీల అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించగా ముఖ్య అతిథిగా వీసీ యాదగిరి రావు పాల్గొన్నారు. వీసీ మాట్లాడుతూ బయోటెక్నాలజీ నూతనంగా ఆవిష్కరించిన ఆధునికశాస్త్రమన్నారు. వర్త మాన కాలంలో మానవ సమాజం ఈ విభాగంలో అనేక వ్యాధుల నివారణకు ఈ శాస్త్రం కృషి చేస్తుందన్నారు. కోవిడ్ లాంటి వైరస్‌లను నశింపజేసేందుకు భారత్ బయోటెక్నాలజీ వ్యాక్సిన్ తయారు చేసి ప్రపంచ వ్యాప్తంగా ప్రజల ప్రాణాలు కాపాడిందని తెలిపారు. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ వృద్ధికి బయో టెక్నాలజీ సేవలు ఎంతో ఉపయోగపడుతయన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ యాదగిరి మాట్లాడుతూ శాస్త్ర, సాంకేతిక అభివృద్ధిలో దేశ వికాసిత భారత్ లక్ష్యంగా ముందుకు పోతుందని పేర్కొన్నారు. విద్యార్థులు తమ లక్ష్యాలను ఎంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రవీణ్ మామిడాల మాట్లాడుతూ కృతిమ వనరులతో అద్భుతమైన ఫలితాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ రెడ్డి, కిరాణ్మాయి, మహేందర్, జవేరియ, ప్రసన్న, పలు కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీవ సాంకేతిక ప్రయోగ పద్దతులు ఉపయోగించే పరికరాలపై అవగహన కల్పిస్తారని తెలిపారు.

యోగాతో ఒత్తిడి దూరం

డిచ్‌పల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): టీయూలో వీసీ యాదగిరి రావు ఆదేశాల మేరకు ఉమెన్‌సెల్ డైరెక్టర్ భ్రమరాంబిక ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవం పురష్కరించుకొని ఆరోగ్య రక్ష నేచర్ కేర్ నిర్వాహకురాలు డాక్టర్ ఐశ్వర్య ఆధ్వర్యంలో విద్యార్థులకు, అధ్యాపకులు అవగాహన కల్పించారు. డైరెక్టర్ భ్రమరాంబిక మాట్లాడుతూ.. యోగాతో ఒత్తిడిని దూరం చేయవచ్చునన్నారు. క్రమ తప్పకుండా యోగా చేయలన్నారు.



టీయూలో విద్యార్థులకు యోగాపై అవగహన కల్పిస్తున్న దృశ్యం



టీటీడీలో పెద్ద శేష వాహనంపై శ్రీవారిని ఊరేగిస్తున్న దృశ్యం

కన్నుల పండువగా కొనసాగుతున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలు

• కుటుంబ సమేతంగా పాల్గొన్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బీర్కూర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ శివారు, తిమ్మాపూర్ గ్రామ సమీపంలోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో గోదా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు కన్నుల పండువగా, వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం అంకురార్పణతో ప్రారంభమైన ఈ వేడుకలు ఆదివారం వరకు కొనసాగనున్నాయి. వేడుకల్లో భాగంగా బుధవారం ఉదయం 7 గంటలకు శ్రీశ్రీశ్రీ దేవనాథ రామానుజ జీయర్ స్వామి వారిచే తీర్థ గోష్ఠి, శ్రీ విశ్వక్సేన, ఆరాధనం, పుణ్య హవచనం, యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ఠ, చతుస్థానార్చనం, ధ్వజారోహనం, బలిహరణం, పూర్ణాహుతి, తీర్థ ప్రసాదాల వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారు భక్తులనుద్దేశించి ప్రవచనాలు చేశారు. ఆలయ ధర్మకర్తలు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆయన సోదరుడు శంభురెడ్డిలు కుటుంబ సమేతంగా పాల్గొని కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ మాడ వీధుల్లో స్వామి వారిని పెద్ద శేష వాహనంపై ఊరేగించారు. స్వామి వారు పెద్ద శేష వాహనంపై నుంచి భక్తులకు దర్శనమిచ్చారు. ఇదిలా ఉండగా సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల వరకు శ్రీ విష్ణు సహస్ర నామ పారాయణం నిర్వహించారు. దేవతాహ్వానం, చతుస్థానార్చనం, పూర్ణాహుతి, బలి హరణం, తీర్థ ప్రసాదాలు భక్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పోచారం సురేందర్‌రెడ్డి అప్పారావు, మురళి, రాంబాబు, నరసరాజు, నాగేశ్వర్‌రావు, భక్తులు పాల్గొన్నారు.

అధ్వానంగా సీసీ రోడ్డు నిర్మాణ పనులు

● నాణ్యత ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్లు ● పట్టించుకోని అధికారులు
● క్యూరింగ్ లేక పగుళ్లు ఏర్పడతాయని స్థానికుల ఆందోళన

తాడ్వాయి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఒక పక్క కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తుంటే కొందరు అధికారులు, నాయకులు కాంట్రాక్టర్లు కలిసి నాణ్యత ప్రమాణాలను తుంగలో తొక్కుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర పూర్తి కావస్తోంది. గ్రామాల అభివృద్ధి కోసం ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో గ్రామాల్లో సుమారు ఐదు లక్షల నుంచి 15 లక్షల వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టారు. కాని గ్రామాల్లో కాంట్రాక్టర్లు సదరు అధికారుల అండదండలతో నాణ్యత ప్రమాణాలు పాటించక ఇష్టారీతిన సీసీ రోడ్లను నిర్మించారు. సీసీ రోడ్డు నిర్మంచి 20 రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు మండల స్థాయి, గ్రామస్థాయి అధికారులు మాత్రం కన్నెతి చూడలేరు. ఏదో అడపాదడపా సీసీ రోడ్లు పోసిన రెండు, మూడు రోజులు గ్రామపంచాయితీ ట్యాంకర్లతో నీటిని పట్టారు. సీసీ రోడ్లకు సరిగ్గా క్యూరింగ్ చేయడం లేదని స్థానికులు అంటున్నారు. సరిగ్గా క్యూరింగ్ చేయకపోతే పగుళ్ళు ఏర్పడి త్వరగా పాడైపోయే ప్రమాదం ఉంది. ఎమ్మెల్సీ కోడ్ ఉండగా గ్రామాల్లో ఆగ మేఘాల మీద సీసీ రోడ్లకు నాయకులు శంకుస్థాపనలు చేశారు. అధికారులు ఏ హంగు అర్భాటం లేకుండా గ్రామంలో ఉన్న ముఖ్య నాయకులతో కలిసి శంకుస్థాపనలు చేసుకోవడం గమనార్హం. కాని ఎలక్షన్ కోడ్ ఉండగా మండల స్థాయి నాయకులు వచ్చి సీసీ రోడ్లకు శంకు స్థాపనలు చేశారు. సదరు అధికారులకు ఆంధ్రజ్యోతి అడుగగా ఎలక్షన్ కోడ్ కంటే ముందే ఆర్డర్ కాపీలు వచ్చినాయి అని అధికారు లు తెలిపారు. సీసీ రోడ్లు పోసి 20 రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు వాటరు క్యూరింగ్ లేక పగుళ్లు ఏర్పడుతున్నాయి. కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటిం చక ఇష్టారీతిన సీసీ రోడ్లు పోశారు. నాసిరకం మెటీరియల్ తీసుకు వచ్చి పోశారని స్థానికులు అంటున్నారు. అధికారులు స్పందించి సీసీ రోడ్లకు క్యూరింగ్ చేసేలా చూడాలని ఆయా గ్రామాల స్థానికులు అంటున్నారు.



వాటర్ క్యూరింగ్ లేక ఎండుతున్న సీసీ రోడ్డు

హోలీకి ముందు ఆకర్షిస్తున్న గోగి పువ్వు



వేసవి కాలం ప్రారంభంలో మోదుక చెట్టుకు గోగి పువ్వు పూయడంతో రోడ్డుపై వెళ్తున్న పాదచారులు, ద్విచక్రవాహనదారులు గోగి పువ్వు అందం చూసి ఆకర్షితులవుతున్నారు. ప్రకృతి పరంగా పూర్వ కాలంలో హోలీ పండుగకు గోగి పువ్వులు వేడినీళ్లలో ఉడకబెట్టడంతో నీళ్లు పసుపురంగుగా మారేది. ఆ నీళ్లతో హోలీ పండుగ రోజు ఒకరిపై మరోకరు రంగులు చల్లుకునే హోలి జరుపుకునేవారు. ప్రస్తుతం మరికొన్ని రోజుల్లో హోలీ పండుగ రాబోతుండడంతో అందంగా విర బూసిన గోగిపువ్వు ప్రయాణికుల దృష్టిలో పడడంతో క్లిక్ మనిపించింది. • (ఆంధ్రజ్యోతి, జుక్కల్)

వైభవంగా లక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణం

● ఘనంగా రథోత్సవం, జాతర

వేల్పూర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం కుకునూర్ గ్రామంలో ఆలయంలో గత మూడు రోజులుగా గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం లక్ష్మీవేంకటేశ్వరస్వామి (పసుపు బాలాజీ) కల్యాణం వైభవంగా నిర్వహించారు. అంతకుముందు ఉదయం ఆలయంలో గ్రామ వైదిక పురోహితులు ప్రశాంత్‌చార్యుల ఆధ్వర్యంలో నిత్య హోమం నిర్వహించి ప్రత్యేక పూజలు జరిపారు. ఉత్సవ మూర్తులకు పట్టు వస్త్రాలు ధరించి ఎదుర్కోలుగా బాజాభజంత్రీలతో గోవింద నామస్మరణాలతో మండపానికి తీసుకు వచ్చారు. పురోహితులు ప్ర శాంత్‌చార్యుల ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చరణల మధ్య లక్ష్మీ వేంకటేశ్వరస్వామి కళ్యాణాన్ని కన్నుల పండువగా అంగరంగా వైభవంగా నిర్వహించారు. సాయంత్రం నిత్యహోమం, రథ బలి, రథహోమం, రథోత్సవం, జాతర ఘనంగా నిర్వహించారు.

కల్యాణోత్సవంలో పాల్గొన్న డీసీసీబీ చైర్మన్

కుకునూర్ ఆలయంలో బుధవారం నిర్వహించిన శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవంలో ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి పాల్గొన్నారు. లక్ష్మీవేంకటేశ్వరస్వామికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వీడీసీ, ఆలయ కమిటీ సభ్యులు రమేష్‌రెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సంతోష్, మాజీ ప్రజాప్రతినిధులు సురేష్, మిట్టపల్లి మహిపాల్, రాజశేఖర్, పత్రి రాజేశ్వర్, గ్రామాభివృద్ధి కమిటీ, దేవాలయ కమిటీ సభ్యులు, హన్మాన్ మాలధారణ భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.



ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి



కుకునూర్ ఆలయంలో లక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు



నగరంలో టపాసులు కాల్చుతున్న బీజేపీ శ్రేణులు

పట్టభద్రుల ఎమ్మెల్సీగా అంజిరెడ్డి గెలుపు

నగరంలో బీజేపీ శ్రేణుల సంబరాలు

టపాసులు పేల్చి మిఠాయిలు పంచుకున్న పార్టీ నేతలు

సుభాష్‌నగర్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి గెలుపొందారు. దీంతో బీజేపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. జిల్లా కేంద్రంలోని నిఖిల్‌సాయి చౌరస్తా వద్ద బుధవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. టపాసులు పేల్చి ఒకరినొకరికి మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీకి ప్రజలు అనుకూలంగా ఉన్నారని, పట్టభద్రులు, టీచర్ ఎమ్మెల్సీ స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు విజయం సాధించడం పట్ల సంతోషంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో బీజేపీ అన్ని ఎన్నికల్లో విజయ దుందుభి మోగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు న్యాలం రాజు, స్వామిదాసు, రాఘవేందర్, విజయ్, మాస్టర్ శంకర్, సాయి, బాలరాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

సుభాష్‌నగర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు రావాల్సిన జవహర్ నవోదయ పాఠశాల ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి వైఖరి వల్ల వెనక్కి వెళ్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి అన్నారు. జిల్లా కేంద్రంలోని నిఖిల్‌సాయి చౌరస్తా వద్ద బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఎంపీ అర్వింద్ జిల్లాకు జవహర్ నవోదయ పాఠశాలను తీసుకువస్తే బోధన్ ఎమ్మెల్యే అడ్డంకులు సృష్టిస్తున్నాడని అన్నారు. బోధన్ షుగర్ ఫ్యాక్టరీకి సంబంధించిన ఎనిమిది ఎకరాలను జవహర్ నవోదయకు కేటాయిస్తున్నట్లు కేంద్ర సభ్యుల బృందానికి తెలపడంతో షుగర్ ఫ్యాక్టరీ భూమిపై భూ వివాదం ఉండటంతో కేంద్ర సభ్యుల బృందం తిరస్కరించినట్లు తెలిపారు. రాష్ట్రానికి వచ్చిన ఆరు జవహర్ నవోదయలకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. ఎంపీ అర్వింద్ ఇప్పటికే రూరల్ నియోజకవర్గం జక్రాన్‌పల్లి మండలం పడకల్‌లో జవహర్ నవోదయకు ప్రతిపాదనలు పంపించారని అన్నారు. బోధన్ ఎమ్మెల్యే బోధన్ పట్టణంలో షుగర్ ఫ్యాక్టరీ స్థలంలో భూమి కేటాయిస్తున్నట్లు ప్రకటించడంతో వెనక్కి వెళ్లే పరిస్థితి ఏర్పడిందన్నారు. షుగర్ ఫ్యాక్టరీ స్థలాన్ని కేటాయించడం అంటే షుగర్ ఫ్యాక్టరీని ప్రారంభించడం లేదా అని ప్రశ్నించారు. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సైతం ఎంపీ అర్వింద్ ఫోన్ చేసి స్థలాన్ని కేటాయించడంపై వివరించారని అన్నారు. కాంగ్రెస్ చేతగాని ఎయిర్‌పోర్టు సైతం రావడం లేదన్నారు. సుదర్శన్‌రెడ్డి రూరల్‌కు రావాల్సిన జవహర్ నవోదయను తీసుకువెళ్తుంటే భూపతిరెడ్డి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. భూపతిరెడ్డి రాజీనామా చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు న్యాలం రాజు, లక్ష్మీనారాయణ, విజయ్ పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయి

మోపాల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి క్రీడాకారులకు సూచించారు. బుధవారం రూరల్ మండలంలోని ఆకుల కొండూర్ గ్రామంలో మహాశివరాత్రి సందర్భంగా గ్రామ యువకులు క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన సందర్శించారు. యువత క్రీడలు నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడాకారులు గ్రామస్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ పద్మారెడ్డి, మండల అధ్యక్షుడు జగన్‌రెడ్డి, మధు, మాజీ సర్పంచ్ అశోక్, సంతోష్, శంకర్‌రెడ్డి, మహేష్, శ్రీనివాస్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామనవమి ఉత్సవాల టెండర్లకు ఆహ్వానం

నిజామాబాద్ కల్చరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమిని పురస్కరించుకొని మాధవనగర్ ఆలయంలో జరిగే ఉత్సవాలకు టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి శ్రీరామ్ రవీందర్ గుప్త తెలిపారు. ఏప్రిల్‌లో ఆలయంలో జరిగే ఉత్సవానికి శ్రీరామనవమిని పురస్కరించుకొని ఆలయంలో జరిగే విద్యుత్ అలంకరణ, రంగులు వేయడం, టెంటు, బారీ కేడ్‌లు, పూలు, అన్నదానం వంటి అంశాలలో అర్హులైన వారి నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 11వ తేదీన ఉదయం 11గంటలకు దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందన్నారు. దరఖాస్తు తీసుకున్న రోజునే మధ్యాహ్నం 2గంటలకు దేవాలయ కార్యాలయంలో దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో టెండర్లను పరిశీలించడం జరుగుతుందని అన్నారు. ఉత్సవాలకు ఏ దరఖాస్తుదారుడైతే తక్కువ టెండరు కోడ్‌ను ఇస్తారో వారికే ఈ టెండర్ అందివ్వడం జరుగుతుందని తెలిపారు.

విధుల్లో ఉన్న ట్రాఫిక్ పోలీసులపై దౌర్జన్యం!

ఖిల్లా, మార్చి 5(ఆంధ్రజ్యోతి): నిబంధనల ప్రకారం విధులు నిర్వహిస్తున్న పోలీసులకు నిలదీతలు తప్పడం లేదు. కొందరు కావాలని పోలీసులపై తిరగబడడం, వారిపై దౌర్జన్యం చేయడం పరిపాటిగా మారింది. జిల్లా కేంద్రంలోని అహ్మదీబజార్ ప్రాంతంలో మంగళవారం రాత్రి ట్రాఫిక్ పోలీసులు విధుల్లో భాగంగా రోజులాగే వాహనాలను తనిఖీ చేస్తూ చలాన్లు వేస్తున్నారు. ఉపవాసదీక్ష విరమించే సమయం కావడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తకూడదని భావించిన ట్రాఫిక్ సిబ్బంది, ప్రత్యేక పోలీసు సిబ్బంది ట్రాఫిక్ నియంత్రించడానికి యత్నిస్తున్నారు. కాగా, కొందరు యువకులు ఇష్టారాజ్యంగా వాహనాలను రోడ్డుపై పార్క్ చేయడం వల్ల అక్కడ తీవ్ర ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమైందని స్థానికులు పేర్కొన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు విచ్చేసిన ప్రత్యేక పోలీసులు వారిని వారించినా వినకపోవడంతో కొందరి వాహనాల తాళాలు తీసుకున్నారు. తమకు తాళాలు ఇవ్వాల్సిందిగా వారు పోలీసులను ప్రశ్నించకుండా వాదనకు దిగారు. అదే సమయానికి అక్కడికి చేరుకున్న ఓ పార్టీకి చెందిన నాయకుడు కల్పించుకొని ఎందుకు వాహనాలను ఆపుతున్నారు. ఉపవాస దీక్ష విరమించే సమయం దగ్గర పడింది కీస్ ఇచ్చివేయాలని దురుసుగా ప్రవర్తించడంతో సమస్య మరింత పెరిగింది. చివరకు పోలీసులే శాంతించి వాహనాల తాళాలను ఇచ్చివేశారు. ఈ విషయమై ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ ప్రసాద్‌ను సంప్రదించగా ఆయన స్పందించ లేదు.

లైన్‌మన్‌ను సన్మానించిన డీఈ

డిచ్‌పల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): లైన్‌మన్ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రానికి చెందిన ట్రాన్స్ కో లైన్‌మన్‌ను బుధవారం డీఈ ఉత్తమ్ జాడే, ఏడీఈ శ్రీనివాస్‌లు లైన్‌మన్ సత్యనారాయణను సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఈ గంగారాం, ఎస్ఎల్ఐ అబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మార్చే రోజు దగ్గరలోనే ఉంది

● ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మార్చే రోజు దగ్గరలోనే ఉందని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'రేవంత్ రెడ్డి తెలంగాణకు ముఖ్యమంత్రివా ఓల్డ్ సిటీగా ముఖ్యమంత్రివా' అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి ప్రజాసమస్యలపై దృష్టిపెట్ట కుండా డైవర్షన్ రాజకీయాలను చేస్తున్నారని విమర్శించారు. ఎస్ఎల్‌బీసీ ఘటన, శాంతిభద్రతల సమస్య, ప్రజా తిరుగుబాటు, బీజేపీ ఎదుగుదలను చూసి ఓర్వలేకనే కిషన్‌రెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కృషి వల్లే మామునూరు ఎయిర్‌పోర్టు, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్,



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

రామగుండం ఎరువుల పునరుద్ధరణ, సమ్మక్క సారలమ్మ ట్రైబల్ యూనివర్సిటీ వంటి ప్రాజెక్టులకు కేంద్రం మద్దతు అందించిందని అన్నారు. ఓటుకు నోటు కేసులో దొరికిన వారు బీజేపీ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. రంజాన్ సందర్భంగా పదో తరగతి ప్రీఫైనల్ పరీక్షల షెడ్యూల్‌ను మార్చడం, మధ్యాహ్న భోజన సమయంలో పిల్లలను ఇబ్బంది పెట్టేలా టైంటేబుల్ మార్చడం ఏంటని ప్రశ్నించారు. జమియాతే ఇస్లామిక్ నిషేధిత సంస్థల కార్యక్రమాలకు ప్రభుత్వ ధనం ఖర్చు పెట్టడాన్ని తప్పు బట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు న్యాలం రాజు, లక్ష్మీనారాయణ, భూషణ్, పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి..

మోపాల్: రూరల్ మండలంలోని అశోక్ ఫారం గ్రామంలోని వైభవ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ సందర్శించి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఆయన వెంట నాయకులు, గ్రామాభివృద్ధి కమిటీ పెద్దలు ఉన్నారు.

వేసవి తీవ్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలి

● అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

నిజామాబాద్ అర్బన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ అధికారులకు సూచించారు. ఎండల తీవ్రత, చేపట్టాల్సిన జాగ్రత్తల చర్యలపై బుధవారం కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. ఈ సారి వేసవి సీజన్‌లో సాధారణం కంటే ఎక్కువగా ఉష్ణోగ్రతలు ఉండే అవకాశం ఉందని వస్తున్న హెచ్చరికలను దృష్టిలో పెట్టుకొని ముందస్తుగానే ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. వైద్య ఆరోగ్య, ఉపాధి హామీ, పర్యావరణ, పంచాయతీరాజ్, కార్మిక తదితర శాఖలు వడదెబ్బ



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

నివారణపై కార్యచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. ప్రతీ ఆరోగ్య కేంద్రం, అంగన్‌వాడి సెంటర్లలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వసతి గృహాలలో ఎండ తీవ్రతపై అవగాహన కల్పించాలన్నారు. వడదెబ్బ నివారణ పద్ధతులను, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రాల ద్వారా ప్రజల్లో అవగాహన పెంపొందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజశ్రీని ఆదేశించారు. ఉపాధి కూలీలు పనిచేసే చోట నీడ అందించేలా టెంట్లు ఏర్పాటు చేయాలన్నారు.

మాదక ద్రవ్యాల నిరోధానికి కృషి చేయాలి

మాదక ద్రవ్యాలు, మత్తుపదార్థాల నిరోధానికి సంబంధిత శాఖల అధికారులు కలిసి కట్టుగా కృషి చేయాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ సూచించారు. బుధవారం ఆయన ఛాంబర్‌లో జిల్లా స్థాయి మాదక ద్రవ్యాల నిరోధక కమిటీ సమావేశం ఆయన నేతృత్వంలో నిర్వహించారు. జిల్లాలో మాదక ద్రవ్యాల వినియోగం, రవాణా, తదితర అంశాలపై సమావేశంలో చర్చించి వాటి నియంత్రణకు చేపట్టాల్సిన చర్యల గురించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ బస్వారెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి, డీఎంహెచ్‌వో రాజశ్రీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.



అమృతపూర్‌లో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

● రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

డిచ్‌పల్లి, మార్చి5 (ఆంధ్రజ్యోతి): గతనెల అమృతపూర్ జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో మృతిచెందిన సిర్నాపల్లి ఒడ్డెన్న కుటుంబాన్ని ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి బుధవారం పరామర్శించారు. మృతుడి కుటుంబానికి తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అమృతపూర్ గంగాధర్ రూ.20వేలను బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మునిపుత్ర నర్సయ్య, గంగాధర్‌గౌడ్, రాందాస్, గంగాధర్‌లు ఉన్నారు.

అనుమానాస్పదంగా యువకుడి మృతి

ఇందల్వాయి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిర్నాపల్లి గ్రామంలో కొవ్వాజి రాకేష్ (23) అనుమానాస్పదంగా బుధవారం మృతి చెందినట్లు ఎస్సై మనోజ్‌కుమార్ తెలిపారు. హనుమాన్ మాలలో ఉన్న రాకేష్ తన మిత్రుడితో వ్యవసాయ పొలంలోకి పశువుల మేతకు వెళ్లి పొలంలో పడి మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. గతంలో రాకేష్‌కు ఫిడ్స్ వచ్చేదని ఫిడ్స్ వచ్చి చనిపోయాడా లేదా ఇంకేమైనా కారణాలు ఉన్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి తండ్రి నడిపి గంగారాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



పొలం వద్ద పురుగుల మందు డబ్బాతో రైతు రఘునాథం

పొలం ఎండిపోతోందని.. పురుగుల మందు డబ్బాతో

రైతు ఆత్మహత్యాయత్నం

● అడ్డుకున్న తోటి రైతులు ● జాడి జమాల్‌పూర్‌లో ఘటన

బోధన్ రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికొచ్చే సమయంలో సాగునీరు అందక ఎండిపోతోందంటూ ఓ రైతు పురుగుల మందు డబ్బాతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన జిల్లాలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. జిల్లాలోని సాలూర మండలం కొప్పర్తి క్యాంప్ గ్రామ రైతు, మాజీ సర్పంచ్ రఘునాథం.. జాడి జమాల్‌పూర్ గ్రామ శివారులో మూడున్నర ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వరి పంట సాగు చేస్తున్నాడు. అయితే పంట చేతికి వచ్చే సమయంలో సాగునీరు లేక ఎండిపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. ఎండలు మండుతుండడంతో.. బోరు కూడా ఒట్టిపోయింది. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన రఘునాథం.. తన పొలంలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించాడు. అయితే వెంటనే స్పందించిన తోటి రైతులు అతన్ని అడ్డుకొని.. డబ్బా లాక్కుతున్నారు. కాగా.. ఈ విషయమై స్పందించిన ఇరిగేషన్ శాఖాధికారులు.. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఆదేశాల మేరకు డీ28కెనాల్ నుంచి చివరి ఆయకట్టు వరకు సాగునీటిని అందిస్తున్నట్టు తెలిపారు. సాగునీరు అందిస్తున్న క్రమంలో ముందుగా ఉన్న రైతులు నీళ్ల తమ పొలాలకు వైపు మళ్లించుకున్నారేమోనని.. అందుకని ఆ వైపు నీటి ప్రవాహం చివరి ఆయకట్టుకు కొంత తగ్గి ఉండవచ్చని అన్నారు. సాగునీటి విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందొద్దని అధికారులు సూచించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీబీకేఎఫ్ నాయకులు

పెంచిన కరువు భత్యాన్ని అమలు చేయాలి

ఖిల్లా,మార్చి 5(ఆంధ్రజ్యోతి): బీడీ కార్మికుల కోసం రాష్ట్ర ప్రభుత్వం పెంచిన కరువు భత్యంను ప్రకటించిన ప్రకారం ఏప్రిల్1నుంచి మార్చి 2026 వరకు అమలు చేయాలని తెలంగాణ బీడీ కామ్‌గార్ ఫెడరేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కోటగల్లీలో గల పార్టీ కార్యాలయంలో బుధవారం నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం నిత్యావసర వస్తుల పెరుగుదలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం బీడీ కార్మికుల కోసం కరువు భత్యం పెంచుతూ జీవోను విడుదల చేసినట్లు గుర్తు చేశారు. ప్రస్తుతం 104పాయింట్ల కరువు భత్యం పెరిగిందన్నారు. 104పాయింట్లకు గాను గతంలో చేసుకున్న ఒప్పందం ప్రకారం పాయింట్‌కు 10పైసల చొప్పున 1000బీడీలకు రూ.104పై వీడీఏ పెరిగిందన్నారు. బీడీ రోలర్స్‌కు 100బీడీలకు మూలవేతనంపై పెరిగిన వీడీఏతో సహా అన్ని కలుపుకుని రూ.261-97 చొప్పున చెల్లించాల్సి ఉంటుందన్నారు. అదే విధంగా నెలసరి ఉద్యోగులకు నెలకు మూలవేతనంపై అదనంగా 312రూపాయలు వీడీఏ పెరుగుతుందన్నారు. బీడీ ప్యాకర్స్‌కు సంబంధించి వివిధ రకాల నమూన బీడీ ప్యాకింగ్ కల్గిన ఒక లక్ష బీడీ ప్యాకింగ్‌కు ఎంత అనేది నిర్ణయించడం జరుగుతుందన్నారు. అందుకు గాను ఈ పెరిగిన కరువు భత్యంను ఏప్రిల్ 1 నుంచి అమలు పర్చాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాబోయే పరిణామాలకు బీడీ యాజమాన్యాలే బాధ్యత వహించాల్సిన అవసరం ఉంటుందని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో జాయింట్ కార్యదర్శులు ఎల్.మధు, జే.బాబురావ్‌లు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి

● నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్



లీకేజీ పనులను చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

సుభాష్‌నగర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వేసవికాలంలో తాగునీటి సరఫరాకు సమస్య రాకుండా చూడాలని నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్ అధికారులను ఆదేశించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న పైప్‌లీకేజీ పనులను వెంటనే చేయాలని అధికారులను ఆదేశించారు. నగరంలోని 15వ డివిజన్‌లోని నిజాం కాలనీలో మున్సిపల్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. నిజాం కాలనీలో ఉన్న రెండు పైప్‌లీకేజీలను గుర్తించి మరమ్మతులు చేశారు. నగరంలో లీకేజీలు లేకుండా ఎప్పటికప్పుడు అధికారులు గుర్తించి మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. మంచినీటి సరఫరాలో ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ మురళి, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణను తొలగించిన మున్సిపల్ అధికారులు



జేసీబీతో ఆక్రమణను తొలగిస్తున్న దృశ్యం

సుభాష్‌నగర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకొని చేపడుతున్న నిర్మాణాన్ని మున్సిపల్ అధికారులు తొలగించారు. బుధవారం నగరంలోని కంఠేశ్వర్ బైపాస్ రోడ్‌లో సర్వే నెంబర్ 219లోగల ఆక్రమణను జేసీబీ సహాయంతో మున్సిపల్ అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు మాట్లాడుతూ. నగరంలో అక్రమంగా ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు.

ఈదుల్ల చెరువు సర్వే పనులు ప్రారంభం

డిచ్‌పల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): గత కొన్నేళ్లుగా నిరాదరణకు గురవుతున్న డిచ్‌పల్లి బస్టాండ్ పక్కన గల ఈదుల్ల చెరువు పూర్తిగా ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉండేలా ఇరిగేషన్ ఏఈ శ్రీచంద్, సర్వేయర్ సుర్యప్రకాశ్‌లు బుధవారం సర్వే ప్రారంభించారు. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు ఆదేశాలతో ఈ చెరువు సర్వే ప్రారంభించినట్లు వారు తెలిపారు. కాగా, రెవెన్యూ ఇరిగేషన్ అధికారుల ఉమ్మడి సర్వేతో కబ్జాదారులలో భయం ప్రారంభమైంది.



విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

ధర్పల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం ప్రారంభమైన ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొదటి రోజు తెలుగు, సంస్కృతి పేపర్-1 పరీక్ష పత్రాలు విద్యార్థులకు అందజేశారు. 280 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 277 మంది పరీక్షకు హాజరయ్యారు. ముగ్గురు గైర్హాజరు అయ్యారు. పరీక్షల కోసం ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రం పరిసర ప్రాంతంలో 144 సెక్షన్ అమలు చేస్తున్నారు.

డిచ్‌పల్లి: మండలంలోని నాలుగు పరీక్ష కేంద్రాల్లో బుధవారం ప్రశాంతంగా పరీక్షలు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 269మంది విద్యార్థులకు గాను 267 హాజరుకాగా ఇద్దరు గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ విఠల్ తెలిపారు. ధర్మారం(బి) సాంఘిక సంక్షేమ గురుకుల పరీక్ష కేంద్రంలో 287 విద్యార్థులకు గాను 255 మంది పరీక్షలకు హాజరు కాగా 12మంది గైర్హాజరయ్యారు. ఆదర్శ పాఠశాల పరీక్ష కేంద్రంలో 395 విద్యార్థులకు గాను 379 విద్యార్థులు హాజరయ్యారని 16మంది గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ దశరత్ తెలిపారు. మండల కేంద్రంలోని ఎస్‌పీఆర్ పరీక్ష కేంద్రంలో 212 విద్యార్థులకు గాను 209 విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగ 3గురు గైర్హాజరయ్యారని చీఫ్ సూపరిండెంట్ మంగమ్మ పేర్కొన్నారు. కేంద్రాల్లో పలు విభాగాల అధికారులు తనిఖీలు చేశారు. డిచ్‌పల్లి పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ అమలు చేసి భద్రత ఏర్పాట్లు కట్టుదిట్టం చేశారు.



చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.150	రూ.220	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	రూ.160	రూ.230	రూ. 250





బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.89200	రూ.82300	రూ.1005

సినిమా గైడ్ నిజామాబాద్



పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : చావా (హిందీ) (10.15)
: శబ్దం (1.35) : సంక్రాంతికి వస్తున్నాం (4.40)
: అగాధియా (7.50)
: రిటర్న్ ఆఫ్ ది డ్రాగెన్ (తెలుగు) (10.40)
స్క్రీన్-2 : శబ్దం (10.05)
: చావా(హిందీ) (1.10, 7.35, 10.55):మజాకా (4.30)
స్క్రీన్-3: రిటర్న్ ఆఫ్ ది డ్రాగెన్ (తెలుగు) (10.10)
: మజాకా (1.20) : గ్యాంగ్స్ ఆఫ్ వసేపూర్ (హిందీ) (4.25) : శబ్దం (7.40, 10.45)
స్క్రీన్-4 : నేనెక్కడున్నా (10.45)
: గార్డ్ (1.25) : చావా (హిందీ) (4.00)
: రిటర్న్ ఆఫ్ ది డ్రాగెన్ (తెలుగు) (7.20)
: మజాకా (10.30)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : చావా (హిందీ) (11.00, 1.40, 4.40, 7.30, 10.20)
స్క్రీన్-2 : గార్డ్ (11.00)
: మజాకా (1.30, 7.35, 10.30)
: రిటర్న్ ఆఫ్ ది డ్రాగెన్ (4.40)
స్క్రీన్-3 : రిటర్న్ ఆఫ్ ది డ్రాగెన్ (1.40, 7.30)
: శబ్దం (4.40, 10.20)

దేవి : మజాకా (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : చావా (హిందీ) (11.00, 2.00, 6.00, 9.00)
విజయ్ : సంక్రాంతికి వస్తున్నాం (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్ : తండేల్ (11.30, 2.30, 6.30, 9.30)

- నిజామాబాద్ అర్బన్